## ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్



06లో

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం, సెప్టెంబర్ 30, 2026 పేజీలు:13

# గండీడ్‌లో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

- గండీడ్‌లో అభివృద్ధి పనులకు వేగం పెంచాలి!
- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలి: పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

**గండీడ్, (ప్రజాజ్యోతి):**

గండీడ్ మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సూచించారు. గండీడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండల అభివృద్ధి, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే మండల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని మండల అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు.



# ప్రపంచ హృదయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ









**అలంపూర్ సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు జమ్మలమడుగు ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కౌన్సిలర్ డాక్టర్ .విజయభాస్కర్ ఆధ్వర్యంలోఏఐ స్టెతస్కోప్ హార్ట్ చెకప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో , మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు , మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ పాల్గొని హార్ట్ చెకప్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు ఏ.ఐ స్టెతస్కోప్ ద్వారా వడ్డేపల్లి శ్రీనివాసులు కి హృదయ పరీక్ష నిర్వహించారు. అదేవిధంగాఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హృదయ ఆరోగ్యాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పించడం అభినందనీయమని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై అవగాహన కలిగి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగావడ్డేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి కూడా ఏఐ స్టెతస్కోప్ పరికరాన్ని స్పాన్సర్ చేస్తామని వడ్డేపల్లి శ్రీనివాసులు ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు.లి ప్రజలకు మరింత అందుబాటులో ఆధునిక హృదయ ఆరోగ్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో ఈ పరికరాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు.గుండె ఆరోగ్యం ప్రతి ఒక్కరి బాధ్యత ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండెను కాపాడుకుందాం" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ తిమ్మప్ప, గార్లపాడు నాగభూషణ్, వడ్డేపల్లి డాక్టర్ స్వప్న, వడ్డేపల్లి ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, వార్డు ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్:**

మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ మీసాల పార్వతమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 2,01,000 విలువైన చెక్కులను అందజేశారు. లబ్ధిదారుల్లో ముంత వెంకటేష్‌కు రూ. 60,000, మీసాల జయమ్మకు రూ. 42,500, తప్పేట స్వాములకు రూ. 28,500, గుజ్జుల లక్ష్మయ్యకు రూ. 20,000, ఆవుల శివుడికి రూ. 17,500, మనలో కృష్ణయ్యకు రూ. 8,000 చొప్పున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మీసాల పార్వతమ్మ మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుగాని బాలపిరు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గోదల వీరయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, టీచర్ వెంకట్ రెడ్డి, గోపి, సంఘమముని వెంకటయ్య, భరత్ కుమార్ రెడ్డి, మధుగాని శివ, మీసాల పెద్ద రాముడు, మీసాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.




# ఆన్లైన్ పేమెంట్లను బహిష్కరించండి డాక్టర్.ప్రేమ్ కుమార్

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 29:**

ఫోన్ పే,గూగుల్ పే,పే. టి.యం వంటి ఆన్లైన్ పేమెంట్ లను బహిష్కరించాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. సర్వీస్ చార్జిల పేరుతో పేద,మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవిదంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఉందని అన్నారు. సర్వీస్ చార్జీల పేరుతో పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని. తక్షణమే ఈ నిర్ణయం వెనక్కు తీసుకోవాలని ఆయన అన్నారు. అక్టోబర్ నుండి విధించే సర్వీస్ చార్జీలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత దేశ ప్రజలందరూ ఆన్లైన్ పేమెంట్లను బహిష్కరించాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ప్రకటనలో తెలిపారు.



# గాంధీ విగ్రహం ధ్వంసం చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి







**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 29:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయించిన మున్సిపల్ చైర్మన్ జయరాముడు,విగ్రహ దాత నారాయణరెడ్డి, నిర్వాహకులు వెంకటరామయ్య సెట్టి, జాఫర్ లను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ సిపిఎం సిపిఐ జిల్లా నాయకులు రాజు పెదబాబు డిమాండ్ చేశారు.గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ సిపిఎం,సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలోని సిబ్బంది సుజాతకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆలయాలకు వెళ్లే దారిలో గాంధీ విగ్రహం అడ్డుగా ఉందని తీసి మున్సిపాలిటీ చెత్త సేకరించే ట్రాక్టర్ లో అవమానకరమైన రీతిలో గాంధీ విగ్రహం తరలించడం సభ్య సమాజంతలదించుకుని పరిస్థితి కల్పించారని తుంగభద్ర నది ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డ్ లో గాంధీ విగ్రహం ధ్వంసం చేసి పడేశారని స్వతంత్రసమరయోధుడు మహాత్మా గాంధీ విగ్రహం తరలింపు పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన మున్సిపల్ చైర్మన్ జయరాముడును పదవి నుండి తొలగించాలని విగ్రహ దాతగా ఉన్న నారాయణరెడ్డి అతని విగ్రహం డివైడర్ లో ఏర్పాటు చేయడం కోసం పాత గాంధీ విగ్రహం అక్కడి నుండి తొలగించి మున్సిపల్ కార్మికుల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించి ఆనవాలు లేకుండా తల చేతులు కాళ్లు బాడీ ధ్వంసం చేయించారని అన్నారు. మున్సిపాలిటీ నుండి కొత్త విగ్రహం ఏర్పాటు చేయడానికి పాలకవర్గం నుండి ఎలాంటి అనుమతి తీసుకోకుండా నిర్వాహకులు వెంకటరామయ్య సెట్టి జాఫర్ మెట్లు రోడ్డు మీదకు పెట్టి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీ తీర్మానం లేకుండా తెలంగాణ మున్సిపాలిటీ చట్టాలకు విరుద్ధంగా విగ్రహం ఏర్పాటు చేశారని అన్నారు. సుప్రీంకోర్టు హైకోర్టు గైడ్లైన్స్ ప్రకారం డివైడర్ ఫుట్ పాత్ రోడ్లు జంక్షన్లు కూడలిలో విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని విధివిధానాలు ఖరారు చేసిన అవేవీ పట్టించుకోకుండా విగ్రవిష్కరణకు ఏర్పాటు చేయడం సరికాదని జిల్లాలో విగ్రహాల కమిటీ చైర్మన్ అయినా జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. గత 70 ఏళ్లుగా ప్రజల ఆస్తిగా ఉన్న లంక వెంకటరామయ్య ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహాన్ని యధావిధిగా ఏర్పాటు చేయాలని కోరారు. పేరు ప్రఖ్యాతల కోసం రాజకీయ లబ్ధి కోసం ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చూసి చూడనట్లు వ్యవహరించడం బాధ్యత రహితమని అన్నారు. పార్టీలకు అతీతంగా ఏర్పాటుచేసిన విగ్రహం స్థానంలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు దౌర్జన్యంగా విగ్రహ ఏర్పాట్లు చేస్తున్నారని దీంతో గ్రామంలో వివాదాస్పదం అయి శాంతి భద్రతల సమస్య కు దారి తీసే అవకాశం ఉందని స్థానిక జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరారు మున్సిపల్ చైర్మన్ జయరాముడు విగ్రహ దాత అయిన నారాయణరెడ్డి నిర్వాహకులు వెంకటరామయ్య సెట్టి జాఫర్ పై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం జరిగిందని కేసు పెట్టి 24 గంటలు గడుస్తున్న వారిపై కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే వారిపై పిడి యాక్ట్ ఊపా చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్న వీరిపై చర్యలు తీసుకొని విగ్రవిష్కరణ కు చేస్తున్న ఏర్పాట్లను ఆపాలని కోరారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పార్టీలకు సంఘాలకు అతీతంగా ఖండించాలని కోరారు. అక్టోబర్ 2న విగ్రవిష్కరణ జరగకుండా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రజిని బాబు,సురేష్ ,కామేశ్వర్ రెడ్డి,శేఖర్,ధర్మరాజు, ఆనంద్,చిన్నముక్తార్, బుచ్చన్న,సిపిఎం నాయకులు నరసింహ, తదితరులు పాల్గొన్నారు

## వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, దోపిడీపై అవగాహన

## - వృద్ధుల సంక్షేమం కోసం చట్టాలపై అవగాహన..

## వైద్య, కంటి, దంత వైద్య శిబిరాలు



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు2026లో భాగంగా మహబూబ్‌నగర్‌లోని "ప్రణాం" వృద్ధుల సంరక్షణ కేంద్రంలో వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, దోపిడీ, వారి హక్కులు, రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఇందిర, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వృద్ధుల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, నిర్లక్ష్యం లేదా దోపిడీకి గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.వైద్య పరీక్షలు : కార్యక్రమంలో భాగంగా వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్యం, భద్రత, గౌరవప్రదమైన జీవనం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సేవల కార్యక్రమ అధికారి డా. సునీత, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి శైలశ్రీ, వైద్యాధికారి డా. నరేష్ చంద్ర, కంటి, దంత, వైద్య సిబ్బంది, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

## - వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం : లా స్టూడెంట్స్ ఫోరం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పాలమూరు యూనివర్సిటీలో చదువుతున్న లా, ఇంజనీరింగ్ విద్యార్థులకు తక్షణమే హాస్టల్ వసతి కల్పించాలని లా స్టూడెంట్స్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (వీసీ) జి.ఎన్. శ్రీనివాస్‌కు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.యూనివర్సిటీలో సీటు సాధించి ఉన్నత విద్య అభ్యసించాలనే ఆశయంతో అడుగుపెట్టిన తమకు హాస్టల్ వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రతిరోజూ సుమారు వంద కిలోమీటర్ల దూరం నుంచి రాకపోకలు సాగిస్తూ చదువుకోవాల్సి వస్తోందని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. తమలో అధిక శాతం మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులేనని, చదువుకు ఆటంకం కలగకుండా తక్షణమే హాస్టల్ వసతి కల్పించాలని కోరారు.

**నిర్లక్ష్యపు అధికారుల నీడలో విద్యార్థుల భవిష్యత్తు.!**

హాస్టల్ వసతి కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదని లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయిన తర్వాతే వసతి కల్పిస్తామని, అప్పటివరకు ప్రత్యామ్నాయం లేదని వీసీ సమాధానమిచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. యూనివర్సిటీలో ప్రత్యామ్నాయ వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 12 గదులను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, పక్కనే ఖాళీగా ఉన్న మరో భవనాన్ని కూడా విద్యార్థుల వసతి కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు.

**వారం రోజుల్లో పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష**



విద్యార్థుల సమస్యల పట్ల వీసీ తన వైఖరిని మార్చుకుని వారం రోజుల్లోగా హాస్టల్ వసతి సమస్యను పరిష్కరించాలని లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా న్యాయం జరగకపోతే యావత్ విద్యార్థి లోకం తరఫున ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి సుదీప్ రెడ్డి, వెంకటేష్, విద్యార్థి జేఏసీ నాయకుడు సాయి, స్వేరోస్ అధ్యక్షుడు పవన్, శివ, ప్రశాంత్, రాణి, మణికంఠ, దీక్షిత్‌తో పాటు లా, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

## - మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ హెచ్చరిక

**చిన్నంబావి,సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)**

రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్నంబావి మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వెలగొండ గ్రామంలో సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా సీడ్ యాక్ట్-1966, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, ఇన్సెక్టిసైడ్ యాక్ట్-1968 ప్రకారం డీలర్లకు పలు సూచనలు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయించరాదన్నారు. కాలం చెల్లిన, నిషేధిత పురుగు మందులను విక్రయించకూడదని స్పష్టం చేశారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు, ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని, రైతులకు కొనుగోలు చేసిన ప్రతి ఉత్పత్తికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.యూరియా, డీఏపీ తదితర ఎరువులతో ఎలాంటి లింక్ ప్రొడక్టులను విక్రయించరాదని హెచ్చరించారు. వ్యాపారులు ఎరువులను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. దుకాణాల్లో రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎరువుల బుకింగ్ కోసం రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే నకిలీ డీఏపీ, ఎరువులు, పెస్టిసైడ్స్‌ను రైతులు కొనుగోలు చేయవద్దని డాకేశ్వర్ గౌడ్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే





డీలర్లపై సంబంధిత చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# జూ పార్క్ సందర్శనతో దివ్యాంగ విద్యార్థుల్లో ఆనందోత్సాహం

## - సమగ్ర విద్యలో భాగంగా 120 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు విద్యా విహారం.. విమానాశ్రయం, సమతామూర్తి విగ్రహం సందర్శన




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పరిశీలనా శక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఆహ్లాదకరమైన అభ్యసన అనుభవాలను అందించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమ్మిళిత విద్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక విద్యా విహారాన్ని నిర్వహించారు.మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా 120 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 30 మంది తల్లిదండ్రులు, 50 మంది ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు హైదరాబాద్‌లోని జూ పార్కును సందర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఈ వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. మహబూబ్‌నగర్ సమన్వయ అధికారి సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ పర్యటన సాగింది.

**జంతువులను చూసి విద్యార్థుల కేరింతలు:**

జూ పార్కులో వివిధ రకాల జంతువులు, పక్షులు, ప్రకృతి అందాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. పుస్తకాల్లో, చిత్రాల్లో చూసిన జంతువులను కళ్లారా చూడటంతో వారిలో ఆసక్తి, ఉత్సుకత పెరిగాయి. జంతువుల జీవన విధానం, ఆవాసాలు, ఆహారపు అలవాట్ల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించింది. అనంతరం విద్యార్థులు భోజనం చేసి, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, పాలమాకుల సమీపంలోని సమతామూర్తి విగ్రహాన్ని సందర్శించారు.

**విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం.. కొత్త విషయాలపై ఆసక్తి:**

ఈ విద్యా విహారం కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, ఆత్మవిశ్వాసం, పరస్పర సహకారం, సామాజిక నైపుణ్యాలు, ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించే విద్యా అనుభవంగా నిలిచింది.

పర్యటనలో తల్లిదండ్రులు, ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి భద్రతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్నేహితులతో కలిసి జంతువులను వీక్షిస్తూ, చిత్రాలు దిగుతూ, కొత్త విషయాలను తెలుసుకుంటూ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు.

**సమాన అవకాశాలే లక్ష్యం:**

ప్రతి ప్రత్యేక అవసరాల విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడం, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, ఆనందదాయకమైన అభ్యసన అనుభవాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విద్యా విహారంలో 120 మంది విద్యార్థులు, 30 మంది తల్లిదండ్రులు, 50 మంది ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దివ్యాంగ విద్యార్థుల విద్యా విహారం విజయవంతం

## - విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రత్యేక విద్యా బోధకులకు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అభినందనలు




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం నిర్వహించిన విద్యా విహారం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి ఐ. విజయకుమారి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు హైదరాబాద్ జూ పార్క్‌తో పాటు పాలమాకుల సమీపంలోని సమతామూర్తి విగ్రహాన్ని సందర్శించే అవకాశం కల్పించడం ద్వారా వారికి ఆహ్లాదకరమైన, విజ్ఞానదాయకమైన, మరపురాని అనుభూతిని అందించారని ఆమె పేర్కొన్నారు. ఈ పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు, ప్రత్యేక విద్యా బోధకులు, జిల్లా సమన్వయ అధికారి సుధాకర్ రెడ్డిని ఆమె హృదయపూర్వకంగా అభినందించారు.

**సమన్వయంతో విజయవంతమైన పర్యటన:**

విద్యార్థుల భద్రత, సౌకర్యాలు, ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యటనను క్రమశిక్షణతో, సమన్వయంతో విజయవంతంగా నిర్వహించిన సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు, ప్రత్యేక విద్యా బోధకుల సేవలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశంసించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ పర్యటనలో చురుకుగా పాల్గొన్న తల్లిదండ్రులకు, ప్రతి దశలో సమన్వయం చేస్తూ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా సమన్వయ అధికారి సుధాకర్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**సమగ్ర అభివృద్ధికి దోహదం:**

ఈ విద్యా విహారం ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక పరస్పర చర్యలు, ఆనందం, కొత్త విషయాలపై ఆసక్తి పెరిగాయని విజయకుమారి పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని ఆమె అన్నారు.పర్యటనను విజయవంతంగా పూర్తి చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

**ఆలంపూర్ సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల మున్సిపాలిటీలో మున్సిపల్ షాపుల అద్దెలకు సంబంధించి వసూలు చేసిన రూ.11.28 లక్షలు సంబంధిత అధికారులు మున్సిపల్ ఖాతాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం తగు చర్యలు చేపట్టారు.ఈ వ్యవహారంలో సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, జూనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ షరాఫ్ రాజవర్ధన్ నాయుడులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగరావును విచారణ అధికారిగా నియమించారు. సంబంధిత రశీదు పుస్తకాలు, రికార్డులు, రిమిటెన్స్ వివరాలను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



# పేద విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అండ

## మండలంలో 1,617 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్ పంపిణీ

**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్**

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, షూస్ అందజేస్తుందని స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్ పంపిణీ చేశారు.మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీసాల పర్వతమ్మ, ఉపసర్పంచ్ మొదలైన బాలపిరు తదితరులు పాల్గొని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్ అందజేశారు.మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు 200 స్కూల్ బ్యాగులు, బీసీ హాస్టల్ విద్యార్థులకు 12 బ్యాగులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 166 బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 1,617 మంది విద్యార్థులకు షూస్ అందజేసినట్లు అధికారులు తెలిపారు.పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించడం ద్వారా వారి చదువుకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం కల్పిస్తోందని సర్పంచ్ మీసాల పర్వతమ్మ పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఖరీఫ్ వరి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

## -- జిల్లాలో ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ సెల్ఫ్ అసెస్‌మెంట్ పోర్టల్ ( పి సి ఎస్ ఏ పి) ద్వారానే వరి కొనుగోలు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాలు, రవాణాపై ప్రత్యేక పర్యవేక్షణ, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో)**



నాగర్ కర్నూల్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం రవాణా, నిల్వ, గన్నీ బ్యాగుల లభ్యత, తేమ శాతం పరిశీలన, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు తదితర అంశాలపై, జిల్లా వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నిర్వహించారు జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల పరిధిలో జిల్లాలో 183 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకుండా తగిన ప్రణాళికతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో, పారదర్శకంగా నిర్వహిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రైతులకు సకాలంలో ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకతను పెంపొందించి, అక్రమాలకు తావులేకుండా ప్రతి కొనుగోలు కేంద్రాన్ని జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాలకు సంబంధించిన వివరాలను పిసి ఎస్ ఏపీ పోర్టల్‌లో నమోదు చేసి నిరంతరం...పర్యవేక్షించాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశంపైసెల్ఫ్–అసెస్‌మెంట్ ద్వారా నిర్వహించాలని సూచించారు. తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీటి వసతి తదితర 16 రకాల మౌలిక సదుపాయాల లభ్యతను పరిశీలించి, సంబంధిత ఫోటోలు, ఆధారాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ( ఎం ఎస్ పి ) రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం రవాణా, నిల్వకు అవసరమైన గిడ్డంగి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని, ధాన్యం రవాణానుసమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు గమనించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు రైతులకు సకాలంలో సేవలు అందించడమే,ప్రజాపాలన విధానం ప్రధాన లక్ష్యమని, ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ తదితర అంశాల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ముందస్తు సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు ఉన్నారు

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

## - అక్టోబర్ 1 నుంచి 163 కొనుగోలు కేంద్రాల ప్రారంభం

## - ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లింపుల్లో జాప్యం ఉండొద్దు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వానాకాలం 202627 సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వానాకాలం 202627 ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 4.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందని, అందులో సుమారు 1.53 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 163 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి:

కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం యంత్రాలు, తేమ శాతం పరీక్షించే పరికరాలు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, సిబ్బంది తదితర అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.కొనుగోలు కేంద్రాలను ఎత్తైన, ముంపునకు అవకాశం లేని ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యం, విద్యుత్ వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్న రకం, దొడ్డు రకం ధాన్యానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జీపీఎస్ అమర్చిన వాహనాల ద్వారా సంబంధిత మిల్లులు, గోదాములకు మాత్రమే తరలించాలని స్పష్టం చేశారు.

### క్వింటాల్‌కు రూ.2,461 వరకు మద్దతు ధర:

గ్రేడ్‌ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,461, సాధారణ రకం ధాన్యానికి రూ. 2,441 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు అదనంగా రూ. 500 బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు.రైతులు ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరిచి, బాగా ఎండబెట్టి, వ్యవసాయ శాఖ జారీ చేసిన టోకెన్ ప్రకారం నిర్ణయించిన తేదీన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం గరిష్టంగా 17 శాతం ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

### 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు:

కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధర మొత్తాన్ని 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు వివరాలను ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్)లో అదే రోజు నమోదు చేయాలని, సంబంధిత రికార్డులను పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ఎల్3 కేటగిరీకి అర్హత కలిగిన కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఓపీఎంఎస్‌కు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు.

### కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు బకాయిల చెల్లింపు:

రబీ 202526 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కమిషన్ రూ. 2.61 కోట్లు బుధవారం సాయంత్రంలోగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ఖాతాల్లో జమ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సహకార శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ శిక్షణలో ఉన్న సాయి శివాని, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నర్సింహులు, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా న్యాయ కొలతల





అధికారి రవీందర్, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, ఐకేపీ, మార్కెట్ కమిటీల ప్రతినిధులు, పర్యవేక్షణ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# అక్రమ నిల్వలు, అనధికార విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు

## ఎరువుల దుకాణాల తనిఖీలు డి ఏ ఓ సక్రియ నర్వ ఏవో అఖిలారెడ్డి

**నర్వ సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా, నర్వ మండల పరిధిలోని వివిధ ఎరువుల విక్రయ కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి (డి ఏ ఓ) సక్రియా నాయక్ మరియు మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) అఖిల రెడ్డి సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఎరువుల నిల్వలు, విక్రయ వివరాలు మరియు రైతులకు జారీ చేస్తున్న బిల్లులను పరిశీలించారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం, అనధికార నిల్వలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని దుకాణదారులకు సూచించారు.అదేవిధంగా, అనధికారిక/లైసెన్స్ లేని దుకాణాలు లేదా వ్యక్తుల వద్ద నుంచి ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. అనధికార నిల్వలు లేదా విక్రయ కేంద్రాల నుంచి ఎరువులను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించినా, నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల నిల్వలు లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తేలినా, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు మరియు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని, రైతులు ఎరువులను అధీకృత ఎరువుల విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు.



# నాగిరెడ్డిపల్లె ఉంద్యాల రోడ్డు పనులకు భూమి పూజ

**నర్వ సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా: నర్వ నుంచి జక్కనపల్లి వరకు నిన్న: కొత్తపల్లి నుంచి పెద్దకడుమూరు వరకు నేడు: నాగిరెడ్డిపల్లి నుంచి ఉంధ్యాల వరకు మంత్రి వాకిటి శ్రీహరి అన్నగారి ఆదేశాలతో అభివృద్ధి పరుగులు. నాగిరెడ్డిపల్లిఉంధ్యాల గ్రామాల మధ్య రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో 3.ఖ.వీ ల 350, మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల రవాణా సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, రైతులకు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం మరింత సులభతరం కానుంది. ప్రజల అవసరాలు గుర్తించి.. నిధులు మంజూరు చేయించి.. పనులు ప్రారంభించేలా కృషి చేస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.లికార్యక్రమంలో పంచాయతి రాజ్ డి ఈ ఉపేందర్ రెడ్డి, నర్వ మండలం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ ఓ రాఘవేందర్, ఏ ఈ తరుణ్ రెడ్డి,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ అంకె భాగ్యమ్మచంద్రశేఖర్, ఉపసర్పంచ్ మొగిలన్న, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు జగన్మోహన్ రెడ్డి గారు,ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శరణప్ప, నాగన్న, వివేకవర్ధన్‌రెడ్డి, బీసం రవి సాగర్, బోయపాటి నర్సింహాతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు..



# వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

## - జిల్లా ప్రాధాన న్యాయమూర్తి డి.రమాకాంత్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)**

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకమని జిల్లా ప్రధానన్యాయమూర్తి రమాకాంత్ అన్నారు రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టుప్రాంగణంలో మంగళవారం మీడియేషన్ 3.0 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి మరియు చైర్మన్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డి.రమాకాంత్ హాజరై ఈ సందర్భంగా మాట్లా డుతూ వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకమని,మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరించుకోవడంతో కసిదారులకు సమయాభావం,ఖర్చు తగ్గుతుందని,మధ్యవర్తిత్వం అనేది న్యాయ పరంగా పరిష్కారం జరగడంద్వారా దీనికి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం స్పెషల్ సెషన్స్ జడ్జ్ పోక్సో కోర్ట్ నసీమ్ సుల్తాన మాట్లాడుతూ చిన్న చిన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడం ద్వారా కోర్టులో పని భారం,తగ్గి మిగతా కేసులకు సమయం దొరుకుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నిహారిక సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిహారిక, సీనియర్ సివిల్ జడ్జ్ గోపిక నాగ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి: మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

## - పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కుమార్తెలతో కలిసి ఓటరు నమోదుకు దరఖాస్తు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మహబూబ్‌నగర్‌లో తన కుమార్తెలు శ్రీహిత, శ్రీహర్షితలతో కలిసి ఆయన పట్టభద్రుల ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులైన పట్టభద్రులు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ, ఈసారి మళ్లీ నమోదు అవసరం లేదని భావించవద్దని సూచించారు.

**అర్హులైన పట్టభద్రులు నమోదు చేసుకోవాలి:**

2023 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఓటరు నమోదును చేసుకోవాలని పేర్కొన్నారు. తమతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తుల్లో అర్హులైన పట్టభద్రులు ఉంటే వారికి కూడా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు.

**నమోదు ప్రక్రియలో సహకరించాలి:**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో యువతకు సహకరించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ కోరారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు.



# అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

## - దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపు

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఓటరు నమోదు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి నమోదు చేసుకున్నారు. గతంలో ఓటు వేసిన వారు సైతం తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకుని నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కోసం:[ఓటరు నమోదు దరఖాస్తు ఫారం ఫారం 18](https: //ceotserms 2.telangana.gov.in/MLC/Form18.aspl)

# ఉచిత కంటి శిబిరంలో 75 మందికి పరీక్షలు

## - 27 మందికి కంటి ఆపరేషన్లు

## - ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ

నాగర్ కర్నూల్ :: సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబర్ 102 లో నిర్వహించిన కంటి చికిత్సశిబిరం విజయవంతమైందని జిల్లా ఆప్తలమిక్ అధికారి కొట్ర బాలాజీ తెలిపారు. నేటి శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 75 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా,అందులో క్యాటరాక్ట్ పొరగల 27 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. రోగులకు శిబిరం లో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు,మందులు అందజేసి జీవిత కాలం కంటిచూపును కలిగి ఉండుటకు నిత్య భోజనంలో విటమిన్–ఏ తో కూడిన క్యారెట్,ఆకు కూరలు,చేపలు,ఆహార పదార్థాలు అధికమొత్తంలో తినాలన్నారు. ఈ కార్యక్రమంలో హేమ్లాలాల్, పోతుల సుకుమార్ రెడ్డి,హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి, శ్రీనివాస్,అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరు పల్లె పాటలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయం

### పల్లె పాటల మొదటి ఎపిసోడ్‌ను ఆవిష్కరించిన ఎస్పీ సునీత రెడ్డి.

### మీసాల రామన్న, వారి టీమ్ ను అభినందించిన వనపర్తి జిల్లా ఎస్పీ

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్

.పాలమూరు పల్లె పాటల పరిమళం జాతీయస్థాయిలో రాణించి, మన జానపద కళలకు మంచి గుర్తింపురావాలని, వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో సునీత రెడ్డి నీ మీసాల రామన్న మర్యాదపూర్వకంగా కలిసి, “పాలమూరు జానపదం ఆడుదాం పాడుదాం“ మొదటి ఎపిసోడ్ పల్లె పాటలను, వారి చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ... పాలమూరు జానపదాల పాటలను ఆవిష్కరణ చేయడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మన పల్లె జీవన విధానం, మన సంస్కృతి, సంప్రదాయాలు, మన జానపద కళలను ప్రజలకు చేరువ చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ పల్లెల్లో తరతరాలుగా వస్తున్న జానపద పాటలు మన సంస్కృతికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది అని, పాలమూరు జానపదం ఆడుదాం పాడుదాం, కార్యక్రమం ద్వారా మన ప్రాంతంలోని జానపద కళాకారులను ప్రోత్సహిస్తూ, వారి కలలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువత కూడా మన పల్లె పాటలు, జానపద కళలు, సంస్కృతి పట్ల ఆసక్తి పెంచుకోవాలని, మన మూలాలను, మన సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మీసాల రామన్న ను, పాలమూరు జానపద బృందం కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రచయిత, గాయకులు చీరల నాగేంద్రం, ఉందేకోటి కృష్ణయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.





# తప్పుడు జనన ధ్రువీకరణ పత్రంపై ఫిర్యాదు

వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్.

తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో పొందినట్లు ఆరోపిస్తూ వీపనగండ్ల గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 28. 2026న కోడేరు మండలం పింఛన్ వెరిఫికేషన్ అధికారి బావాయపల్లి గ్రామానికి చెందిన మావిళ్ల లక్ష్మి పేరుతో జనన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.మావిళ్ల లక్ష్మి 1995 సెప్టెంబర్ 8న వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన్మించినట్లు, 2026 సెప్టెంబర్ 16న వీపనగండ్ల గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి జనన ధ్రువీకరణ పత్రం జారీ అయినట్లు అందులో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రికార్డులను పరిశీలించగా, మావిళ్ల లక్ష్మి పేరుతో ఎలాంటి జనన నమోదు రికార్డు లేదని గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.గ్రామపంచాయతీ కార్యదర్శి యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌ను దుర్వినియోగం చేసి, ఇతరుల సహాయంతో తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో పొందినట్లు అనుమానం వ్యక్తం చేశారు. సదరు ధ్రువీకరణ పత్రాన్ని ఉపయోగించి ఒంటరి మహిళ పింఛన్ పొందేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత వ్యక్తుల పాత్రను నిర్ధారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు మేరకు ఎస్సై జె. నరేష్ కేసు వివరాలను నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల మక్తల్ ఇంచార్జీగా బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి ,

నర్వ సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి



త్వరలో జరుగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మక్తల్ నియోజకవర్గ ఇంచార్జీగా బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి గారిని నియమిస్తున్నట్లు మహబూబ్నగర్ పార్లమెంటుసభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ తెలియజేసారు.అదేవిదంగా సహ ఇంచార్జీలుగా శ్రీ కర్నె స్వామి , శ్రీమతి జిందే జ్యోతి శ్రీనివాస్ మరియు శ్రీ జయానంద్ రెడ్డి గార్లను నియమించారు.ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల ఎన్రోల్ మెంట్ ప్రక్రియలో మక్తల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలలోని పట్టభద్రులను గుర్తించి వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేసే విషయంలో రాజీ పడకుండా పని చేయాలనీ శ్రీమతి డీకే అరుణమ్మ సూచించారు. మాపై నమ్మకముంచి ముందుకు నడిపిస్తున్న జేజమ్మ హృదయపూర్వక అభినందనలు తెలిపిన శ్రీ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని పట్టబద్రులను గుర్తించి ఎన్రోల్ మెంట్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలియజేసారు.

# 10 నెలల పసికందుకు అరుదైన ఆపరేషన్

## - హాప్లోయిడెంటికల్ స్టెమ్‌సెల్ మార్పిడితో కొత్త జీవితం

## - యశోద ఆస్పత్రి వైద్యుల అరుదైన వైద్య విజయం

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

అరుదైన వారసత్వ ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న 10 నెలల పసికందుకు యశోద ఆస్పత్రి వైద్యులు అత్యాధునిక చికిత్స అందించి విజయవంతంగా ప్రాణాపాయం నుంచి బయటపడేశారు. తీవ్రంగా పడిపోయిన ప్లేట్లెట్ కౌంట్‌తో పాటు రక్తస్రావం ముప్పుతో బాధపడుతున్న చిన్నారికి తండ్రి నుంచి మూలకణాలను సేకరించి హాప్లోయిడెంటికల్ స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించి వైద్యులు అరుదైన విజయాన్ని సాధించారు.ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నందవరం గ్రామానికి చెందిన ముల్ల ఖాజా, రేష్మ దంపతుల 10 నెలల కుమారుడు ఎం. ఖాదర్ అర్మాన్ ప్లేట్లెట్ల సంఖ్య తీవ్రంగా తగ్గిపోవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు గతేడాది డిసెంబర్ 26న హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రికి చిన్నారిని తీసుకొచ్చారు.

**అరుదైన వ్యాధిగా నిర్ధారణ:**

చిన్నారికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు 'అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా' అనే అరుదైన వారసత్వ ఎముక మజ్జ వైఫల్య రుగ్మతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా శరీరంలో ప్లేట్లెట్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో తీవ్రమైన థ్రోంబోసైటోపెనియా, రక్తస్రావం వంటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంటుందని వైద్యులు తెలిపారు.

**తండ్రి మూలకణాలతో చికిత్స:**

సాధారణ చికిత్సలతో పరిస్థితిని పూర్తిగా నియంత్రించడం కష్టంగా ఉండటంతో, చిన్నారికి తండ్రి నుంచి సేకరించిన మూలకణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్ స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించాలని వైద్య బృందం నిర్ణయించింది. ఈ మేరకు జనవరి 8న అరుదైన స్టెమ్‌సెల్ మార్పిడి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించినట్లు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ విక్రమ్ కుమార్ తెలిపారు. చికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిరంతరం పర్యవేక్షించింది. వైద్యపరంగా పరిస్థితి స్థిరంగా ఉందని నిర్ధారించిన అనంతరం చిన్నారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ విక్రమ్ కుమార్ వెల్లడించారు.




**చిన్నారి కుటుంబంలో ఆనందం:**

తీవ్రమైన అరుదైన వ్యాధితో తమ బిడ్డ భవిష్యత్తుపై ఆందోళనకు గురైన తల్లిదండ్రులకు విజయవంతమైన స్టెమ్‌సెల్ మార్పిడి ఆశాకిరణంగా మారింది. ఆధునిక వైద్య సాంకేతికత, నిపుణుల సమన్వయంతో చిన్నారికి విజయవంతంగా చికిత్స అందించడం వైద్య రంగంలో మరో ముందడుగుగా నిలిచింది.

# టీఎస్ సీపీఎస్ఈయూ గండీడ్ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

**గండీడ్(ప్రజా జ్యోతి):**

టీఎస్ సీపీఎస్ఈయూ గండీడ్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను బీసీ విద్యార్థి సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉద్యోగులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోమ వెంకటయ్య, కృష్ణయ్య, మొగులయ్య, నర్సింహులు, కురుమయ్య, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.



# నాగర్లబండ తండాలో మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన

**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్ :**

మండల పరిధిలోని నాగర్లబండ తండా గ్రామపంచాయతీ పరిధిలో నూతన మహిళా సంఘం భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ గోపి నాయక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఎన్ఆర్ఐజిఎస్ నిధుల నుంచి భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గోపి నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు సొంత భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు.గ్రామపంచాయతీలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మంజూరైన రూ.10 లక్షల నిధులతో భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆర్. జయరాం నాయక్, ఆర్. భాస్కర్ నాయక్, ఆర్. పాండు నాయక్, కాంట్రాక్టర్ మస్తాన్, ఏఈ. కిషన్ నాయక్, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పీఎం శ్రీ నిధులను సద్వినియోగం చేయాలి

## -విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరం-పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ఏర్పాట్లు -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)**



నాగర్క ర్నూల్ జిల్లా పరిధిలోని వట్టెం జవహర్ నవోదయవిద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం,ఆధునిక మౌలికసదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాల సమగ్ర అభివృద్ధికి పీ.ఎం శ్రీ పథకం కింద అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా సద్వినియోగం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ హాల్లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి,విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,పీ.ఎం శ్రీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,నిధుల వినియోగం తదితర అంశాలపై పాఠశాల ప్రిన్సిపల్ పూర్ణిమను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం,సృజనాత్మకత, వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని,పీ.ఎం శ్రీ పథకం ద్వారా  అందుబాటులో ఉన్న నిధులను విద్యార్థులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ పారదర్శకంగా,సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.విద్యార్థుల్లో సంగీతంపై ఆసక్తిని పెంపొందించేందుకు మ్యూజిక్ టీచర్ నియామక ప్రక్రియ పూర్తయిందాఅని ప్రిన్సిపల్ను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు విద్యతోపాటు సంగీతం,కళలు,క్రీడలు తదితర రంగాలలో నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలుకల్పించాలని జిల్లా లోని ప్రముఖ పర్యాటక,చారిత్రక,ప్రకృతి అందాలకు సంబంధించిన ప్రదేశాలను జవహర్ నవోదయ విద్యార్థులు సందర్శించేలా అవసరమై ఏర్పాట్లను కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.తరగతి విద్యతోపాటు జిల్లాలోని చారిత్రక,సాంస్కృతిక, ప్రకృతివైవిధ్యాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి విజ్ఞాన పరిధిని విస్తరించవచ్చని,విద్యార్థుల విద్యాభ్యాసానికి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే పాఠశాలకు అవసరమైన 20 కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ మంజూరు చేయడం జరిగిందని,కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి,ఆధునిక విద్యా విధానాలకనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయం,తాగునీరు,పారిశుద్ధ్యం,విద్యావసరులు తదితర అంశాల పై సమావేశంలో చర్చించి విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.11,12 వ తరగతి విద్యార్థులకు ఐ.ఐ.టీ ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక బోధన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారికి అవసరమైన అదనపు బోధన,మార్గదర్శకత్వంఅందించేలా ప్రణాళిక రూపొందించాలని,పాఠశాలలో విద్యార్థుల పరీక్షల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేలా తరగతులవారీగా ఫలితాలను విశ్లేషించిఅవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని,విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు వారి ప్రతిభను వెలి కితీసేందుకు విద్యా, సాంస్కృతిక, క్రీడా, సాంకేతిక కార్యక్రమాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్,ప్రిన్సిపల్ పూర్ణిమ,పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు బాలాజీ నాయక్,శిరీష్,డాక్టర్ సృజన,పేరెంట్స్ కమిటీ సభ్యులు రవికుమార్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యం కావాలి

## - 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

## - చిన్నంబావిలో సేవా సంకల్ప్ అభియాన్

**చిన్నంబావి,సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా 'వికసిత్ భారత్2047' కార్యక్రమాన్ని చిన్నంబావి మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్లో నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో, పాఠశాల ప్రిన్సిపాల్ లింగస్వామి సారథ్యంలో జరిగిన కార్యక్రమానికి నాగర్కర్నూల్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే 'వికసిత్ భారత్2047' లక్ష్యమన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సాంకేతికత, ఉపాధి తదితర రంగాల్లో పురోగతికి యువత కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. యువతలో నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందితే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. యువత భాగస్వామ్యం కీలకం సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రధాని మోదీ ప్రజా సేవా ప్రస్థానం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను యువతకు పరిచయం చేయడంతోపాటు వికసిత్ భారత్ లక్ష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సంకల్పంలో విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే సమగ్ర దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల జనరల్ సెక్రటరీ సంపత్కుమార్, డి.వెంకటయ్య, కోళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివేకానంద హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచితం పేరుతో ప్రైవేట్ ఆసుపత్రుల దందా?

# ఉచిత వైద్య శిబిరమా? రోగుల సహనానికి పరీక్షా?

## - కుర్చీలు కరువు.. గంటల తరబడి నిరీక్షణ.. సిబ్బంది దురుసు సమాధానాలు!

## - అభయప్రద ఆసుపత్రి నిర్వాకంపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
రోగులకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రులే వారి సహనానికి పరీక్ష పెడితే ఎవరికి చెప్పుకోవాలి.? ఉచిత వైద్యం అందిస్తామని ప్రచారం చేసి, ఆసుపత్రి వచ్చే రోగుల సంఖ్య పెంచుకునే వ్యాపార ధోరణి తో వ్యవహరించి వచ్చిన రోగులకు కనీస సౌకర్యాలు కల్పించకపోతే అది సేవా కార్యక్రమమా.? లేక ప్రచార ఆర్భాటమా.? అనే ప్రశ్నలు మహబూబ్‌నగర్‌లోని అభయప్రద ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం తీరుపై వ్యక్తమవుతున్నాయి. రోగికి వైద్యం అందించడం సేవ.. రోగిని గంటల తరబడి నిలబెట్టడం ఏ రకమైన సేవ.? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.






### “ఉచిత వైద్యం పేరుతో గంటల తరబడి నిరీక్షణ.!లి

పేద ప్రజల ఆరోగ్య అవసరాలను ఆసరాగా చేసుకుని ఉచిత వైద్య శిబిరాల పేరిట ప్రైవేట్ ఆసుపత్రులు ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని అభయప్రద ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చారు. గత మూడు, నాలుగు రోజులుగా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడంతో వందలాది మంది ఆశతో ఆసుపత్రికి చేరుకున్నారు. అయితే అక్కడికి వచ్చిన రోగులకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.“ఉచితంగా వైద్యం అందిస్తామని పిలిచి.. రోజంతా నిలబెట్టడం ఏం న్యాయం.?“ అంటూ రోగులు ప్రశ్నించారు.

### పరీక్షల పేరుతో రోగులకు పరీక్ష.. గంటల తరబడి పడిగాపులు.!

ముందస్తుగా ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ, తమకు తెలిసినవారికి ప్రాధాన్యం ఇచ్చి త్వరగా పరీక్షలు నిర్వహిస్తున్నారని పలువురు రోగులు ఆరోపించారు. దీంతో తమకు అన్యాయం జరుగుతోందంటూ కొందరు రోగులు ఆసుపత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. రోగుల నమోదు ప్రక్రియకే సుమారు మూడు గంటల సమయం పట్టగా, ఈసీజీ పరీక్ష కోసం మరో రెండు గంటలు వేచి చూడాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. ఇక టు-డీ ఎకో పరీక్ష కోసం సాయంత్రం ఆరు గంటలైనా తమ వంతు రాకపోవడంతో పలువురు రోగులు నిరాశతో వెనుదిరిగినట్లు ఆరోపించారు. “ఆశతో ఆసుపత్రికి వస్తే.. ఆయాసంతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి!“ అన్నట్లుగా ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహణ సాగిందని రోగులు వాపోయారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయకుండా, క్రమబద్ధమైన విధానంలో పరీక్షలు నిర్వహించడంలో ఆసుపత్రి యాజమాన్యం విఫలమైందనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

### “మీడియా అయితే ఏంటి?“.. ప్రశ్నిస్తే దురుసు సమాధానాలా.?

శిబిరంలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రశ్నించిన ఓ మీడియా ప్రతినిధితో టు-డీ ఎకో సాంకేతిక నిపుణుడు దురుసుగా మాట్లాడినట్లు ఆరోపణలు వచ్చాయి. రోగుల సమస్యలపై ప్రశ్నించగా “మా ఇష్టం.. మీరెవరు అడగడానికి.? మీరు మీడియా అయితే మాకుఏంటి.?“ అంటూ సమాధానమిచ్చినట్లు సమాచారం. అదేవిధంగా ఆసుపత్రి నిర్వాహకుడు కృష్ణను రోగులు తమ సమస్యలపై ప్రశ్నించగా, ఆయన కూడా దురుసుగా సమాధానమిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు బాధితులు ఆరోపించారు. రోగులకు సేవ చేయాల్సిన చోటే వారి సమస్యలను పట్టించుకోకపోవడం, ప్రశ్నించిన వారిపట్ల దురుసుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు.. విచారణకు డిమాండ్:

అభయప్రద ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ఎదురవుతున్న నిర్లక్ష్యం, రోగులకు కనీస సౌకర్యాల లేమి, సిబ్బంది వ్యవహారశైలిపై మీడియా ప్రతినిధులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. రోగులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఉచిత వైద్య శిబిరాల పేరిట ప్రచారం చేసుకునే ఆసుపత్రుల నిర్వహణ తీరుపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఉచిత వైద్యం అంటే రోగుల ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టడం కాదు.. సేవ అంటే ప్రచారం కాదు, బాధ్యత! పేద ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు నిర్వహించే ఆసుపత్రులు రోగులకు తగిన సౌకర్యాలు కల్పించాలి. లేనిపక్షంలో “పేరు గొప్ప.. ఊరు దిబ్బ“ అన్న చందంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోవాల్సి వస్తుందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. రోగుల ఆరోగ్యంతో చెలగాటమాడే నిర్లక్ష్యానికి అడ్డుకట్ట పడుతుందా.? ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారా , మీన వేషాలు వేస్తారా వేచి చూడాలి.

# పాముకాటుతో మహిళ మృతి



**ఆలంపూర్ సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అయిజ మండలం పులికల్ గ్రామానికి చెందిన అంజనమ్మ (45) మంగళవారం పాముకాటుకు గురై మృతి చెందింది.వివరాల్లోకి వెళితే... అంజనమ్మ కూలి పని నిమిత్తం ఉత్తనూర్ శివారులోని పొలాల్లో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఈ క్రమంలో పత్తి పొలంలో పాము కాటు వేయడంతో ఆమె కేకలు వేసింది. ఆ కేకలు విన్న తోటి కూలీలు ఆమెను హుటాహుటిన అయిజకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.మృతురాలి కూతురు అనూష ఫిర్యాదు మేరకు ఎస్ఐ గురుస్వామి కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# హిందూ విశ్వాసాలపై వ్యాఖ్యలా..?

# గండీడ్‌లో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన!

## సీఎం దిష్టిబొమ్మ దహనం.. హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

**గండీడ్, (ప్రజాజ్యోతి):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లు, భక్తుల విశ్వాసాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ గండీడ్ మండలంలో బీజేపీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ గండీడ్ మండల అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. సనాతన ధర్మానికి ప్రతీకలైన శ్రీరాముడు, పరమశివుడి భక్తులను పేదలుధనికులు, ఉత్తరాదిదక్షిణాది అంటూ విభజించేలా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. హరిహరులు ఒక్కటేనని, భక్తికి ప్రాంతీయ, ఆర్థిక వ్యత్యాసాలు ఉండవని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ సమాజ విశ్వాసాలను రాజకీయాల్లోకి లాగడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మత విశ్వాసాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాజకీయాల కోసం దేవుళ్లను విడదీసే ప్రయత్నాలు చేయకూడదని హితవు పలికారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చే జై శ్రీరామ్ నినాదం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక అని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని హిందూ సమాజానికి బహిరంగంగా, బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా మత విశ్వాసాలపై వివాదాలకు తావివ్వడం సరికాదని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి గిర్మోని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు ఎన్. భద్రేశ్వర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రఘు, మండల కోశాధికారి శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

## సేవా సంకల్పంలో అంగన్వాడీ కేంద్రాల పరిశీలన!

## పోషకాహారంపై ఆరా.. అంగన్వాడీ సిబ్బందికి సన్మానం

**గండీడ్, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి):**

బీజేపీ నిర్వహిస్తున్న సేవా సంకల్పం నెలరోజుల కార్యక్రమంలో భాగంగా గండీడ్ మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నరహరెడ్డి, భద్రేశ్వర్, వంశీ, రాజేశ్వరి కన్వీనర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, భోజనం నాణ్యత, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు పథకాలపై అవగాహన కల్పించారు. సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బందిని అభినందించి సన్మానించారు. కొమరెడ్డిపల్లి బూత్ నెం.80, ఆశిరెడ్డిపల్లి బూత్ నెం.78,79, రుసుంపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను నాయకులు సందర్శించారు. రుసుంపల్లిలో అంగన్వాడీ టీచర్ నిర్మల, ఆయా ఈశ్వరమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె. రాజు, మండల ఉపాధ్యక్షుడు భద్రేశ్వర్, బీజేవైఎం అధ్యక్షుడు యాదగిరి, మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్ గౌడ్, బూత్ అధ్యక్షులు శివకుమార్, మైపాల్, కృష్ణయ్యతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

